22న సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర

నిజాంపేట్ : ఉప్పల్ – నారపల్లి ఫ్లైఓవర్ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎంఐ ఆధ్వర్యంలో మార్చి 22న పాదయాత్ర చేపట్టనున్నట్లు మేడ్చల్ జిల్లా నాయకుడు బాలపీర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 22 ఉదయం 9:30 గంటలకు చెంగిచెర్ల చౌరస్తా (మేడిపల్లి) నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన వివరించారు.

హెచ్ఏఎల్ వెస్ట్ అధ్యక్షుడిగా ఆంజనేయులు



నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు ఆంజనేయులు

కుత్బుల్లాపూర్: హెచ్ఏఎల్ వెస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఆంజనేయులు 4 వసారి అధ్యక్షుడిగా విజయం సాధించారు. ప్రత్యర్థి అది ఏవీ రావుకు 91 ఓట్లు రాగా, ఆంజనేయులుకు 194 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా శ్యామ్ కుమార్, కోశాధికారిగా అప్పలరాజు లను ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని ఆంజనేయులు అన్నారు.

నిరుపేదల పెన్నిధి.. సీఎం సహాయ నిధి



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ధనరాజ్ యాదవ్, రంగరాయ ప్రసాద్

నిజాంపేట్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల పాలిట పెన్నిధి అని, ఎంతోమంది పేద కుటుంబాలను ఆపత్కాలంలో ఆదుకుంటూ వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతుందని మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం నిజాంపేట్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో మంజూరైన రూ.37,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ లబ్ధిదారు శివానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంగరాయ ప్రసాద్, రవికాంత్ పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశం అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. అనంతరం హెచ్ఎం శ్రీనివాస్ గౌడ్ తో కలిసి విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యం సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

రంగారెడ్డినగర్: స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని జలమండలి జీఎం అశోక్ అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాజులరామారంలో డ్రెయిన్ వాటర్ పైపు లైన్ ఏర్పాటు చేసే క్రమంలో తాగునీటి పైపులైన్‌లు ధ్వంసమయ్యాయని స్థానికుడు మధుసూన్‌రెడ్డి జీఎం దృష్టికి తీసుకొచ్చారు. జీడిమెట్ల అపర్ణ సెరినిటీలో తాగునీటి సరఫరాను పెంచాలని, గాజులరామారంలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శ్రీరామ్‌నగర్‌లోని ఎంఎఫ్ ఫంక్షన్ హాల్ సమీపంలో బోరును రిపేరు చేయాలని, సూరారం స్కందా నగర్‌లో నీటి పైపులైన్ లీకేజీని అరికట్టాలని ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన జీఎం అశోక్ వెంటనే పరిష్కరించాలని ఆయా సెక్షన్ మేనేజర్లను ఆదేశించారు.



ప్రాథమిక స్థాయిలోనే ఏఐ శిక్షణ

విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు

కుత్బుల్లాపూర్ మండలంలో 4 పాఠశాలల ఎంపిక

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాన్ని మెరుగుపరచడం, విద్యా ఫలితాలను ఖచ్చితత్వంతో అంచనా వేయడం, సంక్లిష్ట భావన నైపుణ్యాన్ని సులభతరం చేయడం, తక్షణ పరిష్కారాన్ని అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరగతులను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ప్రాథమిక విద్యాస్థాయి నుంచే ఏఐ సహాయంతో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు.

–రంగారెడ్డినగర్

నాలుగు పాఠశాలల ఎంపిక..

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జడ్పీహెచ్ఎస్ షాపూర్‌నగర్, జడ్పీహెచ్ఎస్ కుత్బుల్లాపూర్, జడ్పీహెచ్ఎస్ సూరారం కాలనీ పాఠశాలలు ఇందుకు ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ ద్వారా విద్యా బోధన అందించనున్నారు. ఒక్కో తరగతి నుండి 10 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ప్రతిరోజు మూడు ఏఐ క్లాసులు ఉండేలా ప్రణాళికలు రూపొందించారు.

విద్యార్థులకు లాభాలు ఇవీ..

విద్యపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం బహుముఖంగా ఉంటుంది. ఏఐ విద్యలో ముఖ్యమైన ఇంటెలిజెంట్ ట్యూటరింగ్ సిస్టమ్‌లు విద్యార్థుల అభ్యాసానికి అసమానమైన మద్దతును అందిస్తాయి. రియల్–టైమ్ అసెస్‌మెంట్, తెలివైన అభిప్రాయాన్ని అందించడం ద్వారా ఏఐ ట్యూటర్‌లు విద్యార్థులకు కొత్త అంశాలను నేర్చుకునేందుకు దోహదపడతాయి, సాంప్రదాయ బోధనా పద్ధతులకు అనుబంధంగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వనరుగా పని చేస్తాయి.

ఉపాధ్యాయులకు సహకార సాధనంగా..

ఉపాధ్యాయులను భర్తీ చేయడానికి బదులుగా సహకారులుగా శక్తివంతం చేయడమే ఏఐ సాంకేతికత లక్ష్యం. ఉపాధ్యాయుల బోధనా వ్యూహాలను మెరుగుపరచడం, వ్యక్తిగతీకరించిన పాఠ ప్రణాళికలను రూపొందించడం, రియల్‌టైమ్ బోధనలో ఉపాధ్యాయులు తోడ్పాటునందిస్తుంది.

తరగతులు ఇలా..

పిల్లలకు ఏఐ విద్యపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎంపిక చేసిన తరగతుల విద్యార్థులను ఐదుగురు చొప్పున బ్యాచ్‌గా ఏర్పాటు చేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై 20 నిముషాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధిస్తుంది. సదరు విద్యార్థి పాఠాలను అర్థం చేసుకుంటున్నాడా ? లేదా అన్న విషయాన్ని ఏఐ గుర్తిస్తుంది. ఒక వేళ విషయం అర్థం కాకపోతే సరళమైన మార్గంలో.. మెరుగైన పద్ధతిలో బోధన అందిస్తుంది. ఇలా ప్రతి విద్యార్థి అభ్యాసన సామర్థ్యాలను మదింపు చేయడంతో పాటు మునుపటితో పోలిస్తే పురోగతి ఎలా ఉందో పరిశీలించి వారి నివేదికను రూపొందిస్తారు.



ఫలితాలను మెరుగు పరుస్తుంది..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఇంటెలిజెంట్ ట్యూటరింగ్ సిస్టమ్స్, అడాప్టివ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల వంటి సాధనాల ద్వారా విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడమే కాకుండా ఉపాధ్యాయుల పరిపాలనా భారాన్ని కూడా తగ్గిస్తుంది, తద్వారా వారు ప్రత్యక్షంగా విద్యార్థుల బోధనపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. ఇప్పటికే ఆయా తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. ఏఐ తరగతుల ద్వారా పాఠ్యాంశాల్లో సందేహాలను నివృత్తి చేస్తాం.

–జెమిని ఎస్ఎస్ కుమారి, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి..

ప్రజావాణికి 14 ఫిర్యాదులు



డిప్యూటి కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న లక్ష్మీనాథ్

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 14 ఫిర్యాదులు అందాయి. ఆయా కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు దెబ్బతిన్నాయని, వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు అందాయి. కమిషనర్ వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఎనిమిది ఫిర్యాదులు అందగా, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు నాలుగు, ట్యాక్స్, శానిటేషన్ విభాగాలను ఒకటి చొప్పున అందాయి. అదేవిధంగా సర్కిల్ పరిధిలో మొత్తం ఆరు ఫిర్యాదులు రాగా ఇంజనీరింగ్ నాలుగు, ఎలక్ట్రిసిటీ రెండు ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్ గాంధీనగర్ లో నూతన సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో డ్రైనేజీ పైప్ లైన్ పూర్తికాగా ఇప్పటివరకు పాడైన రోడ్డును వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణం నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

జీడిమెట్ల: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌సాగర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ సోమవారం ఉదయం బైక్‌పై జీడిమెట్ల డిపో నుంచి సంజయ్‌గాంధీ నగర్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో బాలానగర్ నుంచి గండిమైసమ్మ వైపు వెళుతున్న నియో లాజిస్టిక్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు టీఎస్ఐఐసీ కాలనీ సిగ్నల్ వద్ద వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రశేఖర్‌కు కాలు విరగగా లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు లైఫ్‌స్పాన్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా కట్ట శ్రీనివాస్‌కుమార్



కుత్బుల్లాపూర్ : భారతీయ జనతా పార్టీ కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా కట్ట శ్రీనివాస్ కుమార్‌ను నియమిస్తూ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి టి.ఆచార్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతూ వచ్చిన ఆయనను రాబోయే గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కట్ట శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం డివిజన్ అధ్యక్షుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మినీ స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించండి



ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్ : నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మినీ స్టేడియం నిర్మాణానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని సోమవారం ప్రజావాణిలో ఆకుల సతీష్ అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. దుండిగల్ పరిధిలోని లావణీ పట్టా భూముల్లో అక్రమంగా గెస్ట్‌హౌస్ నిర్మించిన వారిపై గతంలో చర్యలు తీసుకున్నా వారు మళ్లీ ప్రభుత్వ భూమి బోర్డును తొలగించారని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 166/9 బౌరంపేట్‌లో ఎన్ఓసీ లేకుండా, సర్వే నెంబర్ 166/1 చెరువు వద్ద విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, సదరు స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్‌రావు, ఎల్లస్వామి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

కుత్బుల్లాపూర్: సుచిత్ర చౌరస్తా నుంచి లయోలా కాలేజీ మీదుగా అల్వాల్‌కు వెళ్లే రోడ్డులో యూటర్న్ మూసివేయడం, అక్రమంగా రోడ్డుకు ఇరువైపులా వ్యాపార కార్యకలాపాలు పెరగడం, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం తో ఇబ్బందులు పడుతున్నామని ప్రగతి ప్రైడ్ అపార్ట్‌మెంట్ వాసులు అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో తాము వినియోగించే యూటర్న్ మూసివేయడం వల్ల రెండు కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని దీంతో వాహనాలు రోడ్డు పక్కనే నిలపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గత నెల రోజుల వ్యవధిలో నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగాయని ఏసీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

రంజాన్ తోఫా పంపిణీ

మోతీనగర్: రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్షలు ఎంతో పవిత్రమైనవని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్, రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన సలావుద్దీన్ సౌజన్యంతో 200 మందికి రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంతైనా సమాజాభివృద్ధికి వెచ్చించాలని సూచించారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఉపవాస దీక్షలు చేపట్టి అల్లాకు కృతజ్ఞతగా ఉండాలన్నారు.



రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

కుత్బుల్లాపూర్: మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు లేనందున ఇబ్బందులు పడుతున్నామని పలు కాలనీలవాసులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు స్థానిక ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆయన ఆయా కాలనీల్లో పర్యటించారు. వివిధ ప్రాంతాలకు ఉన్న అప్రోచ్ రోడ్డుపై హెచ్ఎండీఏ అధికారులు అభ్యంతరం తెలపడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రిలయన్స్ పెట్రోల్ పంపు నుంచి సబ్ స్టేషన్ వరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద 500 మీటర్ల వరకు రోడ్డు వేసేందుకు ఓ నిర్మాణ సంస్థ ముందుకు వచ్చినా అధికారులు అడ్డుకుంటున్నారని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవసరం కోసం తప్పకుండా రోడ్డు వెయిస్తానని హామీ ఇచ్చారు. వుడ్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి భిక్షపతి రోడ్డు డ్రైనేజీ సమస్యలను మైనంపల్లికి వివరించారు. కట్ట మైసమ్మ ఆలయం వద్ద రాత్రి వేళల్లో పోకిరీలు ఇబ్బంది పెడుతున్నారని మహిళలు ఫిర్యాదు చేయగా అక్కడే ఉన్న ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్ లకు అక్కడ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రీట్ లైట్లు కావాలని కోరడంతో డిఈ రఘుపతి రెడ్డితో ఫోన్లో మాట్లాడి సాయంత్రం లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



కుత్బుల్లాపూర్: కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం క్షత్రియ యూత్ ఫెడరేషన్ (కేవైఫ్) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌లను అందచేశారు. ఈ సందర్భంగా కేవైఫ్ అధ్యక్షుడు సుధీర్ వర్మ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో గత 11 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య మాట్లాడుతూ ఏటా కేవైఫ్ సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు విద్య, వైద్యం విషయంలో సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణంరాజు, సుధీర్ రుద్దరాజు, సంతోష్ వర్మ, ప్రశాంత్, జంపన కిరణ్, దినేష్, రవితేజ, హరి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం..



చింతల్: హెచ్ఎంటీ అటవీ ప్రాంతంలో సోమవారం ఆకతాయిలు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. దీనిపై ఫారెస్ట్ అధికారులు, హెచ్ఎంటి అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోకపోవడంతో వందలాది చెట్లు కాలిబూడిదయ్యాయి. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

నానో మెటీరియల్స్‌పై శిక్షణ ప్రారంభం



కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్, గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో 'రసాయన, బయో సెన్సార్లలో నానో మెటీరియల్స్' అనే అంశంపై ఐదు రోజుల పాటు ప్రత్యేక కోర్సును నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని సోమవారం వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూహెచ్‌లో అత్యాధునిక పరిశోధన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయన్నారు. 'ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో సిద్ధాంతం (థియరీ)తో పాటు ప్రయోగాత్మక శిక్షణ (ప్రాక్టికల్) కూడా అందించటం ద్వారా విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. భిన్న రంగాల్లో పరిశోధనలు చేయడానికి వెనుకాడకూడదన్నారు. తాను మెకానికల్ ఇంజనీరింగ్ చదివి, ఆ తర్వాత అమెరికాలో ఎన్ఏఎస్ఏ ప్రాజెక్టులో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పరిశోధనలు చేసిన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. మల్టీడిసిప్లినరీ విధానం అనుసరించడం ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించగలరన్నారు. అనంతరం అమెరికాలోని ఎలిజబెత్ సిటీ స్టేట్ యూనివర్సిటీకి చెందిన డా. బిజేంద్ర కుమార్ నానో టెక్నాలజీ మౌలిక సూత్రాలు, గ్రాఫీన్, కార్బన్ నానోట్యూబ్ వంటి అధునాతన పదార్థాలు, బయోసెన్సింగ్ రంగాలలో వాటి వినియోగాలను వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ డా. విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. నరసింహారెడ్డి, జీఐఏఎన్ లోకల్‌కోఆర్డినేటర్ డా. హేమలత పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి తదితరులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



మణికొండ: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ.. 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరిట పలు కాలనీల్లో కార్యక్రమం నిర్వహించి పలు సమస్యలను గుర్తించామన్నారు. పుప్పాలగూడ శ్మశానవాటికకు రోడ్డు, అంబేడ్కర్ భవన నిర్మాణం, శ్మశాన వాటికల ఏర్పాటు, మారుతీనగర్ రోడ్డు ఆక్రమణ, రెడీమిక్స్ వాహనాలు తిరగడంతో పాడైన రోడ్లు, నెమలినగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శానిటేషన్ కార్మికులకు ఏడాదిలో 15 రోజుల సెలవులు ఇవ్వాలని, అలాగే వీధి కుక్కలకు షెల్టర్ హోం నిర్మించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, కె. రాఘవరెడ్డి, దిలీప్‌కుమార్, యాలాల కిరణ్, సుమ నళిని పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకు గ్రూప్ 1, 2, 3 వంటి పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఎంఆర్‌పీఎస్ శేరిలింగంపల్లి మండల ఇంచార్జి గణేష్ మాదిగ మాట్లాడుతూ మాల ప్రజా ప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. వర్గీకరణ బిల్లు చట్టం రూపం దాల్చేవరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు నరేష్ మాదిగ, ఉపాధ్యక్షులు వినోద్ మాదిగ, నానక్‌రాంగూడ అధ్యక్షులు రాజు మాదిగ, నాయకులు సాయి, పింటు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.